క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమ బుద్ధా రోడ్డు పడమర వైపు ముగ్గురు రోడ్డు నుంచి నిడమర్రు రోడ్డు వరకు ఉన్న ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, పెదవడ్లపూడిలోనూ కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో పంటపొలాల డొంకల్లో కోడిపందేల స్థావరంపై తాడేపల్లి ఎస్‌ఐలు రమేష్, నారాయణ సోమవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం గుండిమెడలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ నారాయణతో కలిసి డొంక రోడ్డులో రెండువైపుల నుంచి దాడి చేశామని, దాడిలో పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని ఎనిమిది బైక్‌లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం




తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడిలో వేంచేసి ఉన్న శ్రీ షిరిడీసాయి బాబా మందిరం 12వ వార్షికోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 12వ వార్షికోత్సవం సందర్భంగా స్వామికి కాకడ హారతి, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈమని సుధాకర్, ఈమని శేషుబాబు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

జిల్లా వైద్యశాలను సందర్శించిన ఢిల్లీ బృందం



తెనాలి అర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలను ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండెర్డ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ అనూప్ కో, డాక్టర్ రాజారామ్ యాదవ్, డాక్టర్ జ్యోతి ఉల్‌హస్ లంద్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలోని ఓపీ, వార్డులు, థియేటర్లు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూప్ కో మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్‌ను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి రోగులకు అందుతున్న వైద్య సేవలతో పాటు అన్ని విభాగాల్ని క్షుణంగా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాలకు ఎన్ క్వాస్ సర్టిఫికెట్ లభిస్తే అదనంగా నిధులు వచ్చే అవకాశం ఉందని, వాటి ద్వారా ఆసుపత్రిలోని అనేక వసతుల కల్పన చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 16 మంది ఎంపిక



తెనాలి అర్బన్: హైదరాబాద్‌కు చెందిన మైండ్ వేవ్ ఇన్‌ఫర్మ్యాటిక్స్ సంస్థ మంగళవారం జేఎంజే కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించింది. సంస్థ ప్రతినిధులు గ్రూపు డిస్కషన్, ఇంటర్వ్యూలను నిర్వహించి 16 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిసమ్మ, ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థుల్ని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ సుధాకరయ్య పాల్గొన్నారు.

అచెంజల సంకల్పం

- శరవేగంగా తాగునీటి పథకం పనులు
- పూర్తి కావొస్తున్న పైపులైన్ల నిర్మాణం
- ఎమ్మెల్యే ఆర్కే కృషి

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగర ప్రజల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నిర్మిస్తున్న తాగునీటి పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రానున్న 30 ఏళ్లలో ప్రజల అవసరాలను అంచనా వేసి రూ.221.53 కోట్ల వ్యయంతో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులతో ఈ పథకాన్ని చేపట్టారు. ఈ పథకంలో భాగంగా 127 కిలో మీటర్ల మేర పైపులైను వేయాల్సి ఉండగా ఇప్పటికే 70 కిలో మీటర్ల మేర పూర్తయింది. ఈ పథకం పూర్తయితే 2050 వరకు ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఢోకా ఉండదు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు నగరంలో కలిసే ఆస్కారం ఉన్నందున మరో 200 కిలో మీటర్ల మేర పైపులైన్లు అవసరమని భావించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవ తీసుకుని అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. త్వరలోనే 200 కిలో మీటర్ల మేర పైపు లైను నిర్మాణానికి ఆమోదం రానుంది.

రెండు ప్యాకేజీలుగా..

రెండు ప్యాకేజీలుగా రూపొందించిన పథకంలో 75 ఎంఎల్‌డీ నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మాణ పనులు చేపట్టారు. పైపులైన్ల దూరం పెరగనున్న దృష్ట్యా నీటి నిల్వ సామర్థ్యమూ పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తొలిదశలో కృష్ణానది వద్ద రా వాటర్ తీసుకునేందుకు ఇంటెక్‌వెల్ నిర్మాణం చేపట్టి నీటిని శుద్ధి చేసే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా నగరంలో తొమ్మిది నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్థలాలను సిద్ధం చేయగా ఇప్పటికే కొన్ని కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వేసవి నేపథ్యంలో త్వరగా తాగునీటి పథకం పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. తాగునీటి పథకం పూర్తయ్యేలోగా మంగళగిరి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గుంటూరు చానల్ పథకం వద్ద మరో సంపుతోపాటు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడి నుంచి పట్టణంలోని కొప్పురావుకాలనీలోని ట్యాంకుకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.



మంగళగిరిలోని తెనాలి రోడ్డులో జరుగుతున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు

ప్ర'జల' శ్రేయస్సే లక్ష్యం



ఏఐఐబీ నిధులతో చేపట్టిన తాగునీటి పథకం పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించాం. రానున్న రోజుల్లో మంగళగిరి–తాడేపల్లి నగరం మరింత విస్తరించనుంది. జనాభా పెరగనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అందుకు సరిపడా మరో పైపులైను నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. మరో 200 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణంతోపాటు తాగునీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం పూర్తయితే రానున్న 30 ఏళ్ల ప్రజలకు 24 గంటలూ మంచినీరు అందించవచ్చు.

–ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

ఏకలవ్యునికి నివాళులు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏకలవ్యునికి నివాళులర్పించారు. పార్టీ ఎస్టీ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షునిగా తాడేపల్లికి చెందిన మేడా వెంకటేశ్వర్లు (పండు)ను నియమించడంతో భారీ ర్యాలీ నిర్వహించి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడా వెంకటేశ్వర్లు (పండు) మాట్లాడుతూ మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, తాడేపల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుల ఆశీస్సులతో తనకు ఎస్టీసెల్ జిల్లా బాధ్యతలు అప్పగించారని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని పేర్కొన్నారు. అనంతరం ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్టీసెల్ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బాలసాని అనిల్, ఎస్సీ సెల్ కన్వీనర్ ముదిగొండ ప్రకాష్, మంగళగిరి మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈశ్వరమ్మ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, ఏకలవ్య ఎరుకుల యువజనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామంచి రవి తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కేఎల్‌యూలో ఫెమ్‌ఫ్లేర్ జాతీయ మహిళా ఉత్సవం

తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మార్చి 2న జాతీయస్థాయి అంతర్ కళాశాలల మహిళా ఉత్సవాన్ని ఫెమ్‌ఫ్లేర్ అనే పేరుతో నిర్వహిస్తున్నట్లు కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కార్యదర్శి కోనేరు కాంచనలత చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఇచ్చిన సూచన మేరకు ఎంబ్రేస్ ఈక్వాలిటీ అనే అంశంతో జరుగుతున్న ఈ ఉత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నేటి తరం మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని చెప్పారు. చదువుతోపాటు టెక్నాలజీలోనూ మహిళలు వెనకడుగు వేయడం లేదని అభినందించారు. ఫెమ్‌ఫ్లేర్ ఉత్సవ కన్వీనర్లు డాక్టర్ హేమ దివ్య, డాక్టర్ కె.రుతు రమ్య మాట్లాడుతూ ఈ ఉత్సవంలో పాల్గొనదలచిన వారు కేఎల్‌యూ వెబ్‌సైట్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. మార్చి 2న 24 గంటలపాటు నిర్వహించే ఈ ఉత్సవంలో ఫ్యాషన్ షో, టెక్నికల్, నాన్ టెక్నికల్ వంటి కార్యక్రమాలతోపాటు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామని అన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన వారికి రూ.లక్ష వరకు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎంహె.ఎస్. డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఉత్సవ కో కన్వీనర్లు డాక్టర్ ఎ.ప్రియ, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, కె.సోని, మహిళా ఫోర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పూజిత పాల్గొన్నారు.



ఫెమ్ ఫ్లేర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ తదితరులు

భార్యపై భర్త దాడి

తెనాలి రూరల్: భార్యపై భర్త దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చినరావూరుకు చెందిన వివాహిత రాణి సోమవారం చినరావూరు పార్కుకు వాకింగ్ కోసం వెళ్లింది. కొద్దిసేపటికి అక్కడికి వెళ్లిన భర్త ఆమెపై దాడి చేశాడు. అనుమానంతో తనను అనుసరించి వచ్చి దాడి చేశాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

తెనాలి: రైతుసంక్షేమం కోరేదే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ నిమిత్తం మంగళవారం తెనాలి రానున్న నేపథ్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సభా వేదికను సోమవారం ఆమెను సందర్శించారు. రైతుల కోసం వ్యవసాయ పరికరాలతో ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, సభావేదిక ముందున్న గ్యాలరీ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారితో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కష్టపడి పని చేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏటా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్‌తో రూ.13,500 పంపిణీ జరుగుతోందని గుర్తుశారు. ఈ ఏడాది కూడా వీటితో పాటు ఇటీవల పంట నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీకి డెల్టాకు ప్రాధాన్యతనిస్తూ సీఎం తెనాలికి రావటం రైతులపై ఆయనకు గల చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సీఈవో మోహనరావు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎల్. విజయలక్ష్మణ్, తహసీల్దార్ కె.రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, అవుతు నగేష్ రెడ్డి ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో పలువురికి పతకాలు

తెనాలి అర్బన్: 20వ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలిలోని సీఎంసీ ఫిట్‌నెస్ జోన్‌కు చెందిన ఆరుగురు క్రీడాకారులకు బంగారు పతకాలు, నలుగురికి వెండి పతకాలు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. రేపల్లెలో ఆదివారం పోటీల్ని నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారుల్ని తెనాలిలో సోమవారం అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చందూస్ జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ చందు వెంకటేశ్వరరావు, డాక్టర్ కోటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ సీటును గెలిపించి సీఎంకు బహుమతిగా ఇస్తా

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు
- తుళ్లూరు మండలంలో పర్యటన

తాడికొండ: తాడికొండ నియోజకవర్గ సీటును గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బహుమతిగా ఇస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. సోమవారం తుళ్ళూరు మండలం వెంకటపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో అసైన్డ్ రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళామని, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు సమస్యలు ఉన్నాయని, ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని కూడా అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తాడికొండ సీటును గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బహుమతిగా ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం హైకోర్టుకు వెళ్ళిన వరప్రసాద్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన జానకి రామిరెడ్డిని కలిసి సత్కరించి పలువురు న్యాయవాదులతో సమావేశమయ్యారు. తుళ్ళూరు కమ్యూనిటీ హాల్ కూడలిలో నిర్మిస్తున్న శ్రీ చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణ కమిటీతో మాట్లాడిన అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కంతేటి బ్రహ్మయ్య అనే యువకుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో ఎంతో ఉపయోగం

మేడికొండూరు: రైతు భరోసా వల్ల ఎంతో ఉపయోగం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. విత్తనాలు, పెట్టుబడులు, ఎరువులు, పంటల అభివృద్ధికి రైతు భరోసా సాయం దోహదపడుతోందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా పలువురు రైతులు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ను గుంటూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ రైతు భరోసాతోపాటు ప్రభుత్వ పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, ముత్యాలబాలస్వామి, కొరివి చెన్నయ్య, కిషోర్, డి.కిరణ్, బూర్దురాజు, ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లి వారి పాలెంలో పలు బాధిత కుటుంబాలకు మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సహాయాన్ని బాధిత కుటుంబాలకు సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ అందజేశారు. చుక్కపల్లివారిపాలెంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న దాసరి సునీల్ కుటుంబానికి 20 వేల రూపాయలు, లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ రోజువారి పనులకు వెళ్లలేక కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్న మేకతోటి సుబ్బారావు కుటుంబానికి 20 వేల రూపాయలు, అదే గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై ఇల్లు కోల్పోయిన నూకల ఏసుదయమ్మ అనే వితంతువుకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), గ్రామ సర్పంచ్ దాసరి సుందరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ

నేడు ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలు వివాహాది శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుంచనపల్లిలో రెండంతస్తుల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. దీనికి మంగళవారం ప్రారంభోత్సం చేస్తున్నట్లు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఈ హాలును రూ.కోటి 50 లక్షలతో నిర్మించామని, ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు దీటుగా నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధుల నుంచి రూ.50 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.కోటి ఖర్చుచేసినట్లు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌గా నామకరణం చేశామని, మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని వివరించారు.



కుంచనపల్లిలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

తెనాలి టౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ఆలయంలోని అష్టభుజి సన్నిధానంలో తిరునాళ్ల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దర్భా హరిబాబు స్వామి ఆధ్వర్యంలో దుర్గమ్మ అమ్మవారిని సోమవారం పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మార్చి ఐదో తేదీ వరకు నిత్యం కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఐదు, ఆరు తేదీల్లో పసుపు గౌరి అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని చెప్పారు.

జగనన్న వరమిచ్చినా.. స్థలం కొరత

- తరగతి గదుల నిర్మాణం కోసం నిధుల నిరీక్షణ
- మనబడి నాడు–నేడు ద్వారా నులకపేట ఉర్దూ పాఠశాల అభివృద్ధి
- స్థల దాతల కోసం అన్వేషించినా ఫలితం శూన్యం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోంది. మన బడి నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తోంది. ఈ క్రమంలోనే స్థానిక నులకపేట ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల ప్రగతికీ అనేక చర్యలు చేపట్టింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న పథకాల వల్ల ఈ పాఠశాలలో అనూహ్యంగా విద్యార్థుల సంఖ్య 40 నుంచి 378కి చేరింది. దీంతో ఈ పాఠశాలను మనబడి నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రూ.20 లక్షలతో నాలుగు తరగతి గదుల మరమ్మతులు, ప్రహరీ నిర్మించారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, ముందు మరో షెడ్డు నిర్మించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలడం లేదు. దీంతో రెండో విడత నాడు–నేడులో భాగంగా మరో నాలుగు తరగతి గదుల నిర్మాణానికి రూ.36 లక్షలు కేటాయించారు. అయితే ఈ గదుల నిర్మాణానికి సరిపడా స్థలం లేకపోవడంతో పేరెంట్స్ కమిటీ స్థల దాతల కోసం ఎదురు చూసింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. ఫలితంగా నిధులు అలాగే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో స్థల దాతలను ఆహ్వానిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దాతలు రాకుంటే కనీసం అధికారులైనా స్పందించి స్థలం కేటాయించాలని, ఉర్దూ పాఠశాల పక్కనే అటవీ భూములు ఉన్నాయని, వాటిని డీ ఫారెస్టు చేసి పాఠశాలకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తరగతి గదులు లేక వరండాల్లో కూర్చున్న విద్యార్థులు



దాతలను కోరుతూ పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగనన్న ఎంతో చేశారు



జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది. మా నలుగురు పిల్లలూ ఉర్దూ పాఠశాలలోనే చదువుతున్నారు. పిల్లల సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలడం లేదు. ప్రభుత్వం నిధులు ఇచ్చింది. కానీ స్థలం లేదు. అధికారులు, దాతలు స్పందిస్తే బాగుంటుంది.

–షేక్ ఖైరున్నీసా, విద్యార్థి తల్లి

స్థలం కేటాయిస్తే బాగుంటుంది



ఉర్దూ పాఠశాలను జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎంతో అభివృద్ధి చేశాం. మనబడి నాడు–నేడు ద్వారా రూ.20 లక్షలతో ఆధునీకీకరించాం. విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు సరిపోవడం లేదు. మరో నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ స్థలం లేదు. దాతలు ముందుకు రావడం లేదు. అధికారులు స్థలం కేటాయిస్తే బాగుంటుంది.

– షేక్ జిలాని, నులకపేట విద్యాకమిటి చైర్మన్